www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 2 అక్టోబర్ 2024

5

తూర్పుగోదావరి

నేడు స్వచ్ఛతా హి సేవ ముగింపు ఉత్సవాలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఈ నెల 2న స్వచ్ఛతాహి సేవ ముగింపు ఉత్సవాలను నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి పాఠశాల విద్యా అధికారి ద్వారా క్షేత్ర స్థాయిలోని అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ తప్పకుండా అన్ని విద్యాసంస్థల్లో స్వచ్ఛతాహి సేవ ముగింపు ఉత్సవాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గాంధీ జయంతిని నిర్వహించాలన్నారు. ఈ మేరకు మండల స్థాయిలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులు కూడా హాజరవుతారన్నారు.

చిక్కని చిరుత జాడ

- 25 రోజులుగా జిల్లాలో మకాం
- బర్రిలంక నుంచి అదృశ్యం
- అటవీశాఖ అధికారుల విఫలయత్నం



చిరుత(ఫైల్)

ప్రజాశక్తి - రావులపాలెం, కడియం

జిల్లాలో చిరుత కలకలం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. 25 రోజుల క్రితం దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోని దూరదర్శన్ కేంద్రం కార్యాలయం ఆవరణలో చిరుత అడుగులజాడలను తొలిసారిగా అధికారులు గుర్తించారు. తాజాగా ఈ చిరుత కడియం మండలం బుర్రిలంకలో సంచరిస్తున్నట్లు ఇటీవల అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. ప్రస్తుతం మూడు రోజులుగా ఇక్కడ చిరుత జాడ కానరాలేదు. గోదావరి లంకల్లో ఉన్నట్టు వార్తలు వచ్చాయి. అయితే అక్కడ పరిశీలించిన అధికారులు అక్కడ కూడా చిరుత జాడలు ఏవీ కనిపించలేదని స్పష్టం చేశారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయాందోళనలోనే జీవిస్తున్నారు.

జిల్లాలో సంచరిస్తున్న చిరుత సమీపంలో ఉన్న మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చిందని అధికారుల అభిప్రాయపడ్డారు. కాని నేటికీ దీన్ని ధ్రువీకరించలేదు. ఒక్కటే వచ్చిందా..? లేక జంటగా వచ్చిందా..? అనే అనుమానం కూడా వ్యక్తమైంది. అయితే 15 రోజుల తరువాత ఒక చిరుత మాత్రమే వచ్చినట్టు వారు నిర్ధారణకు వచ్చారు. కడియం మండలంలోని బుర్రిలంకలోని ఒక నర్సరీలో చిరుతపులి పాదముద్రలను గుర్తించారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలు, సోలార్ సిసి కెమెరాలను అమర్చి గాలింపు చేపట్టారు. ట్రాప్ బోన్‌లను సైతం ఏర్పాటు చేశారు. కాని ఎక్కడ చిరుత జాడ కానరాలేదు. గత నాలుగు రోజులుగా ఎలాంటి జాడ కనిపించలేదని కోనసీమ జిల్లా ఫారెస్టు అధికారి ఎంవి ప్రసాదరావు స్పష్టం చేశారు. గత నెల 28న గోదావరి లంకల్లో చిరుతను చూశామని కొంత మంది మత్స్యకారులు తెలిపారన్నారు. దీంతో ఆ ప్రాంతంలో డ్రోన్ కెమెరాలతో పరిశీలించామని, బోటులో వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించామని అక్కడ కూడా చిరుతకు సంబంధించి ఎలాంటి జాడ కనిపించలేదని ఆయన స్పష్టం చేశారు. దీంతో అటు కోనసీమ, ఇటు తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కడియం నర్సరీల్లో చిరుత పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

అధికారుల విఫలయత్నం

చిరుతను బంధించేందుకు అటవీశాఖ అధికారులు విఫలయత్నం చేస్తున్నారు. దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టులో 70 ట్రాప్ కెమెరాలను అమర్చి చిరుత కదలికలను పరిశీలిస్తూ వచ్చారు. దాన్ని బంధించేందుకు 7 బోన్‌లను కూడా అమర్చారు. తాజాగా చిరుత దిశ మార్చడంతో కడియంలో 20 ట్రాప్ కెమెరాలు, 5 సోలార్ బేస్ట్ సిసి కెమెరాలను అమర్చారు. రెండు బోనులను అక్కడ కూడా అమర్చారు. ప్రస్తుతం 5 బృందాలు గాలిస్తున్నాయి. 60 మంది అటవీ సిబ్బంది డ్రోన్‌తోనూ జల్లెడ పడుతున్నారు. కాని ఇప్పటి వరకూ చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. అధికారులు ప్రణాళికలకు అనుగుణంగా బోనులోకి వెళ్లే రీతి లేకుంటే మేకపై దాడి చేస్తే తగు జాగ్రత్తలు తీసుకుని మత్తు ఇంజక్షన్ ఇచ్చేందుకు సైతం సిద్ధపడినా చిరుత జాడ లేక అంతా అయోమయంలో పడ్డారు.

ప్రజల్లో ఆందోళన

జిల్లాలో చిరుత సంచారంతో ప్రజల్లో భయాందోళన నెలకొంది. వర్షాకాలంలో మొక్కల ఎగుమతులు దిగుమతులు అధికంగా జరుగుతుంటాయి. నర్సరీల మధ్యగా చిరుత సంచారం నేపథ్యంలో కూలీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దాదాపు 4 వేల ఎకరాల్లో ఉన్న నర్సరీల్లో 30 వేలకు మందిగా కూలీలు పనిచేస్తున్నారు. నర్సరీలను ఆనుకునే జనావాసాలు కూడా ఉండటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ప్రస్తుతం చిరుత సంచారంతో కొంత మంది కూలీలు పనులకు కూడా వెళ్లడం లేదు.

కంగారు పడొద్దు

చిరుతపులి కనిపిస్తే కంగారు పడి పరిగెట్టరాదని డిఎఫ్ఒ సూచించారు. నిజంగా పులి ఎదురుపడితే దాన్ని చూస్తూ చేతులు పైకి ఎత్తి బిగ్గరగా అరుస్తూ వెనుకకు మరలాలన్నారు. జాగ్రత్తగా అక్కడ నుంచి తప్పుకోవాలన్నారు. తనకంటే ఎత్తయిన జంతువులు, మనుషులపైకి చిరుత దాడి చేయదని తెలిపారు. కంగారు పడి పరిగెడితే దాడి చేస్తుందని సూచించారు. బయట ఒంటరిగా తిరుగరాదని, గుంపులుగా వెళ్లాలని, కర్ర టార్చ్ లైట్‌తో బయటకు వెళ్లాలని సూచించారు. గోదావరి పరివాహ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

చిరుతపులి విషయంలో అసత్య ప్రచారాలు చేసే చర్యలు తప్పవని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. గోదావరి లంకల్లో సిబ్బంది బృందాలుగా ఏర్పడి అన్వేషణ కొనసాగిస్తున్నామని తెలిపారు. కడియం నర్సరీలలో పనిచేసే వారికి చుట్టు పక్కల ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చిరుత కోసం గాలింపు చేపడుతూనే మరో పక్క తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

నిరసన దీక్షలో కూర్చొన్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలి

విద్యార్థి, యువజన సంఘాల నిరసన దీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలంటూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నందం గనిరాజు సెంటర్లో మంగళవారం 'విశాఖ ఉక్కు పరిరక్షణ దీక్ష'ను నిర్వహించారు. 50 మంది విద్యార్థులు ఈ దీక్షలో కూర్చొన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బి.అరుణ్ పూల దండలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, డివైఎఫ్ఐ నాయకులు వి.రాంబాబు మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరించే విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలన్నారు. విశాఖ ఉక్కుని సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. రాష్ట్రంలో గతంలో ఉన్న వైసిపి ప్రభుత్వం గాని, నేడు అధికారంలోకొచ్చిన టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం గాని విశాఖ ఉక్కు కోసం కనీసం ప్రశ్నించడం లేదని విమర్శించారు. ప్రయివేటీకరణ ఆపడానికి ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అందుకే విద్యార్థి, యువజన సంఘాలు ఈ దీక్షలకు పిలుపునిచ్చాయన్నారు. ప్రయివేటీకరణకు అడుగులు వేస్తే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజనులను ఐక్యం చేసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు టికె.విశ్వేశ్వరరెడ్డి, ఎన్ఎస్‌యుఐ నాయకులు తారకేశ్, ఎఐటియుసి యూనియన్ నాయకులు కోదండరామ్, సిఐటియు నాయకులు బి.పవన్, పి.పూర్ణిమ రాజు, కె.ఎస్.వి.రామచంద్రరావు, ఎస్.వెంకటేశ్వరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.బేబీరాణి, ఎం.గోవర్ధన్ మద్దతు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు గిడుగు రుద్రరాజు ఫోన్ ద్వారా సంఘీభావం తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.పవన్ ముగింపు ఉపన్యాసం చేసి దీక్షను ముగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జ్యోతి, కనక, సాహితీ, సురేష్, నాగచైతన్య, శివ, మేఘన, పావని, మధు, చైతు, హేమంత్, పిడిఎస్‌యు నాయకులు కె.భానుప్రసాద్, వి.ధనేష్, రోహిత్, శివ, సన్నీకుమార్ పాల్గొన్నారు.

వ్యాసరచన విజేతలకు బహుమతుల ప్రదానం

దేవరపల్లి : స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందించారు. "స్వర్ణాంధ్ర సాధనకు రానున్న ఐదేళ్లలో విద్యారంగంలో తీసుకు రావాల్సిన సంస్కరణలు" అనే అంశంపై ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి అక్కాబత్తుల కారుణ్య, ద్వితీయ బహుమతి డి.పుల్లలక్ష్మీదుర్గ, షేక్ అమీనా తృతీయ బహుమతి కె.హర్షిత, పి.కావ్య గెలుచుకున్నారు. వారికి కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గద్దె శ్రీనివాసరావు సభ్యులు డి.వీరసత్యం ప్రిన్సిపల్ శివాజీ బహుమతులు అందించారు.

వృద్ధులు అమూల్య సంపద

ప్రజాశక్తి -దేవరపల్లి

వృద్ధులు అమూల్య సంపద అని యర్నగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ గుడివాడ సురేంద్ర కుమార్ నాయుడు అన్నారు. వృద్ధుల దినోత్సం నేపథ్యంలో కృష్ణంపాలెం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు పండ్లు అందించారు. వారితో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు సిఎస్ఆర్‌లో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా సంస్థ తరపున రూ.10వేల విలువ చేసే ఆరు సీలింగ్ ఫ్యాన్లను ఆశ్రమానికి అందించారు. వృద్ధులకు తాడేపల్లిగూడెం యోగాగురు రేణుకాదేవి యోగాలో శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీర్ శ్రీనివాస్, సంఘమిత్ర స్కూల్ కరస్పాండెంట్ గుంపుల సత్యకృష్ణ ఆశ్రమ నిర్వాహకులు గుదే శ్యామలాదేవి, పుట్టా పోసిబాబు ధూళిపూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తాళ్లపూడి, ప్రక్కిలంక గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. లబ్ధిదారులతో మాట్లాడారు. పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, సర్పంచ్ అప్పన జగదీష్, టిడిపి నాయకులు వుడతా వీరేంద్ర, గోలి మణికంఠ, గుండు బోగుల ప్రసాద్, సన్యాసినాయుడు, ఎంపిడిఒ రమణ, గ్రామ కార్యదర్శి ఆశ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు. డిపిఒ బి.శ్రీనివాసరావు పింఛన్ల పంపిణీని పరిశీలించారు. 7864 మంది లబ్ధిదారులకు గాను 7657 మందికి పింఛన్లు అందించామని ఎంపిడిఒ రమణ ఎలిపారు.

కార్టూ'నిజం'



రాయితీపై పరికరాలు అందించాలి

మాట్లాడుతున్న గంగోలు సర్పంచ్ దాకే గంగారాణి

ప్రజాశక్తి-గోపాలపురం

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు వ్యవసా పరికరాలను రాయితీపై వీలైనంత త్వరగా అందించేందుకు అధికారులు కృషి చేయాలని సగ్గొండ సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు, గంగోలు సర్పంచ్ దాకే గంగారాణి కోరారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం సగ్గొండ, గంగోలు గ్రామాల్లో ఆయా సర్పంచుల అధ్యక్షతన వ్యవసాయ అధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాయితీపై సూక్ష్మ పోషకాలను, వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. ఇవి రైతులకు ఉపయుక్తంగా ఉంటున్నా యన్నారు. పరికరాలు, పనిముట్లను వీలైనంత త్వరగా రైతులకు అందుబాటులో ఉంచితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అధికారులు మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులకు సూక్ష్మ సేద్యం కింద డ్రిప్, స్ప్రింకర్లను సరఫరా చేస్తున్నామన్నారు. శాశ్వత పందిరి వేసుకుని కూరగాయలు సాగు చేసుకునే వారికి ప్రభుత్వం రాయితీస్తుందని, ఆయిల్ ఫామ్, కొబ్బరి, తోట పంటలకు రాయితీలు ఉన్నాయన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డులు అందుబాటులో ఉన్నాయన్నారు. పాడి రైతులకు రూ.30 వేల నుంచి రూ.80 వేల వరకూ 70 పైసల వడ్డీతో రుణం అందుతుందన్నారు. పురుగుమందులు రసాయనాలు అవశేషాలు లేని పంటలు సాగు చేసుకోవాలన్నారు. సేంద్రియ పంటలు సాగు చేసుకోవాలన్నారు. దీని కోసం అవసరం అయితే శిక్షణ కూడా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ బి.రాజారావు, వెటర్నరీ డాక్టర్ ధరణిబాబు, రైతులు మేన్ని గంగాధర్, శ్రీహరి, సుధాకర్, కోడూరి వెంకటరమణ, కోడూరి దుర్గారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాజ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకులు రాజు, మధు పాల్గొన్నారు.

అవినీతిపరులకు అధికారుల అండ

కడియపు లంక పంచాయతీ పాలకవర్గం ఆగ్రహం

ప్రజాశక్తి - కడియం

ప్రభుత్వాలు మహిళాస్వావలంబనకు కృషి చేస్తున్నాయని, అందుకు భిన్నంగా ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లో డిఆర్‌డిఎ అధికారులు వ్యవహరిస్తున్నారని కడియపులంక పంచాయతీ పాలకవర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం సర్పంచ్ పాటంశెట్టి రాంజీ అధ్యక్షతన పాలకమండలి సమావేశమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ రాంజీ పాలకమండలి సభ్యులు బోడపాటి రాజేశ్వరి తదితరులు మాట్లాడారు. తమ గ్రామ పరిధిలోని డ్వాక్రా మహిళా సంఘాల్లో అనేక అవకతవకలు జరిగాయన్నారు. పలు సంఘాల సభ్యులు ద్వారా ఈ విషయం పంచాయతీ దష్టికి వచ్చిందని సర్పంచ్ రాంజీ తెలిపారు . దీనిపై తాను మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులతో కలిసి విచారణ జరపాలని గత నెల 5న డిఆర్‌డిఎ పీడీకి ఫిర్యాదు చేశామన్నారు. నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా కింద స్థాయి అధికారులకు కొమ్ము కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈ వ్యవహారంలో ఉదాసీనంగా వ్యవహరించిన అధికారిపై తగు చర్యలు తీసుకోవా లని, లేకుంటే ఎంఎల్ఎ గోరంట్ల, మహిళా సంఘ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు.

విద్యార్థులకు ఐడి కార్డుల అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మోర్తలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-2 విద్యార్థులకు ఐడి కార్డులు అందించామని హెచ్ఎం ఎస్ఎల్‌వి. ప్రసాద్‌రావు తెలిపారు. లయన్స్ క్లబ్ పైడిపర్రు-తేతలి, ఉందుర్తి పాల్ ఫౌండేషన్ సంయుక్తంగా రూ.4 వేల ఆర్థిక సాయంతో వీటిని సమకూర్చారు. క్లబ్ ప్రెసిడెంట్ ఉందుర్తి ప్రసన్న కుమార్, పాల్ ఫౌండేషన్ సభ్యులు దున్నా అమర్‌బాబు, తలపాకుల అఖిల్ ఐడిలు అందించారు. పాఠశాలకు భారతదేశ నాయకుల లామినేటెడ్ ఫోటోలు అందించామని ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.బేబిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండలంలో గ్రామ సభలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ జివిఎస్ఆర్‌కె.రాజు మంగళవారం తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను జాతీయ ఉపాధి హామీకి సంబంధించి పనుల గుర్తింపు, పనుల కల్పనకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆయన తెలిపారు. గురువారం ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో ఎన్‌టిఆర్ భరోసా, సామాజిక పింఛన్ల పంపిణీ 98 శాతం పూర్తయ్యిందని ఎంపిడిఒ జివిఎస్ఆర్‌కె.రాజు మంగళవారం తెలిపారు. సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన బండి నారాయణమ్మ అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రత్నం ఆసుపత్రికి వెళ్లి ఆమెకు పింఛను అందించారు.

5న ఎంబిఎ, ఎంసిఎ ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎంబిఎ, ఎంసిఎ (టూరిజం అండ్ హాస్పిటాలిటీ), ఎంసిఎ కోర్సుల్లోని మిగిలిన సీట్లకు ఈనెల 5న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని విసి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఎపి ఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల్లో సీట్ల భర్తీకి ఈ కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. యూనివర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారని, అభ్యర్థులు ఉదయం 9:30 నుంచి 11 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారన్నారు. సీట్లు, ఫీజు వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా పొందొచ్చన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సహజ వనరులకు రక్షణ

ప్రజాశక్తి- కడియం

ప్రకృతి వ్యవసాయంతోనే సహజ వనరులకు రక్షణ అని జిల్లా ఉద్యాన అధికారి సుజాత తెలిపారు. మాధవ రాయుడుపాలెం, కడియపు సావరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వ హించారు. ప్రకృతి వ్యవసాయపై రైతులకు అవగాహన కల్పించారు. మాధవరాయుడు పాలెంలో డిహెచ్ఒ సుజాత, సావరంలో జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు పాల్గొన్నారు. ఎరువులు, పురుగుమందులు తక్కువగా వినియోగించాలని రైతులకు సూచించారు. సబ్సిడీతో అందిస్తున్న సూక్ష్మ పోషకాలను వినియోగించు కోవాలన్నారు. రాయితీ యంత్రపరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ద్వారకాదేవి, హెచ్ఒ సుధీర్ కుమార్, మత్స్య శాఖ అధికారి గోపాలరావు, ఎపిఎం అప్పలకొండ, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా రాజు

ప్రజాశక్తి-గోకవరం

రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా బుంగా రాజు ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం ఆర్‌కె రెసిడెన్సీ ఫంక్షన్ హాల్లో అసోసియేషన్ సమావేశం మంగళశారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షునిగా తిరుమాలయాపాలెం గ్రామానికి చెందిన బుంగా రాజుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా, జిల్లా విభజన తరువాత జిల్లా డీలర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. డీలర్ల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆయన ఎన్నిక పట్ల గోకవరం మండల రేషన్ డీలర్స్ అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చాగల్లు విద్యార్థులు

ప్రజాశక్తి - చాగల్లు

ఫుట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం పి.వీర్రాజు తెలిపారు. గత నెల ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారని తెలిపారు. ఈ మేరకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జె.విజయలక్ష్మి, చంద్ర ప్రేమలను ఎస్ఎంఎస్ ఛైర్మన్ కొట్టూరు గోపాలకృష్ణ, సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. అండర్ -19కు రమ్య, శైలజ, వైష్ణవి, భవాని, సంజీవి, జాహ్నవి, దుర్గ ఎంపికయ్యారన్నారు. అండర్ 14కు మోహిని, ప్రవల్లిక, పావని జోషి ఎంపికయ్యారన్నారు.

పారిశుధ్య కార్మికులకు బీమా

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉచిత ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించామని సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు బి.జోగయ్య, జి.సురేష్‌బాబు తెలిపారు. సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరరి తరపున, మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పిఎంఎస్‌బివై, పిఎంజెజెవై బీమా కార్డులను 10 మంది పారిశుధ్య కార్మికులకు అందించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ ఎ.రాజశేఖర్, మహిళా పోలీసు మేరీకుమారి, పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెకుముకి పరీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జెవివి ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పరీక్షలు శ్రీ గౌతమి స్కూల్ శ్రీరామ్‌నగర్ బ్రాంచ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా కన్వీనర్ ఎన్.రవిబాబు మాట్లాడారు. విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జెవివి కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా ప్రతి ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తుందని తెలిపారు. మండల స్థాయి విజేతలకు అక్టోబర్ 27 వ తారీఖున జిల్లాస్థాయి చెకుముకి పరీక్షను నిర్వహిస్తామన్నారు. ప్రిన్సిపల్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాలు చేయడం ద్వారా ఆచరణాత్మకత ద్వారా సైన్స్‌ని నేర్చుకోవడం సులభం అవుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మొదటి బహుమతి కంటిపూడి రామారావు మున్సిపల్ హై స్కూల్, ద్వితీయ బహుమతి లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్, తతీయ బహుమతి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కన్సోలేషన్ బహుమతి చునీలాల్ జాజు మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు సాధించారు. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతిని శ్రీ గౌతమి స్కూల్ గాంధీపురం, ద్వితీయ బహుమతిని శ్రీ గౌతమి స్కూల్ శ్రీరామ్ నగర్, తతీయ బహుమతి ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ గెలుపొందింది. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు శ్రీరాములు, సిహెచ్.నిశ్చల్, బి.గోపాల్ పాల్గొన్నారు.

కడియం : కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు మంగళవారం చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. హెచ్ఎం టి.సత్యనారాయణ ఈ పరీక్షను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలతో విజ్ఞానం పెంపొందుతుందన్నారు. ఈ పోటీలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో వేమగిరి తోట, దుళ్ల, కడియం పాఠశాలల విద్యార్థులు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రయివేటు పాఠశాలల విభాగంలో షిరిడి సాయి విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు అక్టోబర్ 27న జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు వెళ్తారని జెవివి మండల కార్యదర్శి వై.నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు గొల్లపల్లి సత్యనారాయణ, బి.సువర్ణవేణి, సిహెచ్‌వివిఎస్ఎన్.శాస్త్రి, పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కన్న తల్లిదండ్రులను ఆదరించడం ప్రతి ఒక్కరూ కనీస బాధ్యతగా తీసుకోవాలని ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం (ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలకు) నాయకులు ఎం.మురళీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వహించిన వృద్ధుల దినోత్సవంలో మురళీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ఇస్తున్న పింఛనును వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్ధులకు స్వర్ణాంధ్ర సేవా సంస్థ చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు వృద్ధులతో కలిసి కేక్ కట్ చేయించారు. 100 మంది వృద్ధులకు ఉపకరణాలు, వీల్‌ఛైర్లు, దుప్పట్లు, పండ్లు అందించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులు, అవసరార్థుల కోసం అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి స్వర్ణాంధ్రకు ఆదర్శ సంస్థగా అవార్డు ఇచ్చిందన్నారు. ప్రతిరోజు వద్ధాశ్రమంలో చేరడం కోసం కనీసం 10 మంది వరకూ వస్తున్నారన్నారు. స్థలాభావం వల్ల అందరికీ ఆశ్రయం కల్పించ లేకపోవడం ఒక్కొక్కసారి బాధగా అనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర వద్ధాశ్రమ నిర్వహణకు సహకరిస్తున్న నగర ప్రముఖులకు, దాతలకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్స్ ను, ఇండియన్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులను, స్వర్ణాంధ్ర పక్షాన సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు ఎమ్‌డి.మస్తాన్, పి.భద్రరావు, వి.సుబ్రహ్మణ్యం, ఎ.సుబ్బారావు, పి.వెంకట్రావు, పప్పు శర్మ, స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, సభ్యులు దివ్య, మీరా కుమారి, శేఖర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉద్యోగం పేరుతో మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అమలాపురం

మాజీ మంత్రి విశ్వరూప్ తో సన్నిహితంగా వున్న ఫోటోలు తమకు చూపి ఉద్యోగాల ఆశ కల్పించి తమ వద్ద రూ.20 లక్షలు దోచేసుకున్నాడని అమలాపురం ఎస్పి బి. కష్ణారావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి కి చెప్పి ఉద్యోగాలు గ్యారెంటీగా వేయిస్తానని సబ్బిత సుజన్ రెండేళ్లుగా తమను మోసం చేస్తున్నాడని తమకు న్యాయం చేయాలని వారు ఎస్పి ని కోరారు.

బాణసంచా తయారీదారులపై కేసు

ప్రజాశక్తి - పెరవలి

పిట్లవేమవరం గ్రామంలో అనుమతులు లేకుండా బాణ సంచాను తయారు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు. సోమవారం రాత్రి దాడులు నిర్వహించి బాణ సంచాను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేశామన్నారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- కడియం

కడియం పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళు దగ్ధమయ్యాయన్ని,రాజమహేంద్రవరం అగ్నిమాపక దళ అధికారులు తెలిపారు. అగ్ని మాపక అధికారి బి.శ్రీనివాసు తెలిపిన వివరాల మేరకు.. కోమటి ప్రభాకరరావు, కోమటి భాస్కరరావు కుటుంబాలు రెండు తాటాకిళ్లలో నివాసం ఉంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు చుట్టూ ముట్టడంతో రెండు తాటాకిల్లు కాలి బూడిదయ్యాయి. రూ. 10 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు తక్షణ సాయంగా ఒక్కొక్క కుటుంబానికి 20 కిలోల బియ్యాన్ని అందజేశారు.

నురగతో వస్తున్న కుళాయి నీరు

నమ్మండి ఇవి తాగునీరే...

ప్రజాశక్తి - సామర్లకోట

'ఈ ఫోటోలో ఉన్నది చెరుకు రసం అనుకుంటున్నారా? సాక్షాత్తు మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న రక్షిత తాగునీరు'. గతంలో పసర రంగు నీరు సరఫరా అయ్యేది. ప్రస్తుతం నురగలు కక్కుతున్న నీరు వస్తోంది. గత కొద్దిరోజులుగా ఇక్కడ కుళాయిల్లో ఇదే మాదిరిగా తాగు నీరు సరఫరా జరుగుతోంది. గోదావరి ముడి జలాలను శుభ్రపరచే క్రమంలో ఆలం, క్లోరిన్ మోతాదులను ఒక క్రమపద్ధతిలో కలపక పోవడంతో ఇలాంటి పరిస్థితులేర్పడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజలకు సురక్షితమైన తాగు నీటిని అందించాల్సిన అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్య వైఖరిని అవాలంభిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజలకు సురక్షితమైన జలాలు అందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

తెగుళ్ల నివారణతో పంట రక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరి సాగులో తెగుళ్ల నివారించటం ద్వారా పంటను రక్షించుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త ఎఎస్.శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని రాయ భూపాలపట్నం రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఎఒ కె.సంజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఉద్యాన శాస్త్రవేత్త ఎం.జానకి ఆయిల్ ఫామ్ సాగులో వచ్చే రుగోస్ తెల్ల దోమ నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్ కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పశువులకు సంబంధించి రైతులకు తక్కువ వడ్డీ సదుపాయంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎడిఎ ఎన్.దైవకుమార్, రైతులు కల్తూరి శ్రీనివాస్, సానిపిని సురేష్, నల్లల శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా దసరా సంబరాలు

ప్రజాశక్తి - శంఖవరం

దసరా ఉత్సవాలు పురస్కరించుకుని కత్తిపూడిలోని మాధురి విద్యాలయంలో దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్కూల్ ఛైర్మన్ కడారి తమ్మయ్యబాబు, సీతాదేవి దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు నవ దేవత రూపాలతో నృత్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా తమ్మయ్యబాబు మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా రాణించడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరపలో 97 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - కరప

మండలంలోని 23 గ్రామాల్లో 97 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కె.అప్పారావు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలు నుంచి అధికారులతో కలిసి గురజనాపల్లిలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, సచివాలయ, అంగన్‌వాడీ, ఆశ కార్య కర్తలతో కలిసి పింఛన్లను పంపిణీ చేసినట్లు చెప్పారు.

ఆదిత్యలో స్వచ్ఛతా హి సేవ

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులతో సూరంపాలెం గ్రామంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 'మన పరిసరాలనే గాకుండా పర్యావరణ, పరిరక్షణ మరియు ప్రకృతిని కాపాడుకోవలిసిన బాధ్యత మన అందరిపై ఉందని, గాంధీ కలలు కన్న స్వరాజ్ స్థాపనకు, క్లీన్ ఇండియాకు కృషి చేయాలని సూచించారు. పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రల పరిసరాలు, మెయిన్ రోడ్ పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోశ్ని బాబురావు, పంచాయతి కార్యదర్శి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దోపిడి దొంగల అరెస్ట్

రూ.70 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-అమలాపురం

అంతరాష్ట్ర దోపిడి దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పి కార్యాలయంలో పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి కృష్ణారావు మాట్లాడుతూ కిమ్స్ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని వెంకటేశ్వరస్వామి గుడిలో గత నెల 4న పోయిన మొత్తం ఆభరణాలను రికవరీ చేశామన్నారు. రూ.70 లక్షల విలువైన 868 గ్రాముల బంగారు ఆభరణాలు, 8.56 కేజీల వెండి ఆభరణాలు దొంగలను నుండి స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సవర సూర్యం, సవర చిన్నారావు, సవర రజని, బత్తిని శ్రీకాంత్ జల్సాలకు, చెడు వ్యసనాలకు అలవాటుపడి, కొంతమందితో కలసి ఒక గ్యాంగ్ గా ఏర్పడ్డారని అన్నారు. సరైన భద్రతా ప్రమాణాలు లేని ఊరికి దూరంగా ఉండే దేవాలయాలను టార్గెట్ గా చేసుకుని దోపిడీలు చేయడం అలవాటుగా చేసుకున్నారని ఎస్పి తెలిపారు . ఈ గ్యాంగ్ ఒక కారు ను అద్దెకు తీసుకుని చోరీ చేయాలనుకున్న దేవాలయాలను ముందుగా రెక్కి నిర్వహించి ఆతరువాత చోరీకి పాల్పడతారన్నారు. అదే విధంగా గత నెల 4న అమలాపురం వచ్చి కిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని రెక్కి చేసి ఆదే రోజు రాత్రి చోరికి పాల్పడ్డారు. నేరస్తులు, మరికొంత మంది కలిసి శ్రీకాకుళం జిల్లాలో 37, విశాఖపట్టణం సిటీలో 1, ప్రకాశం జిల్లాలో 1, గుంటూరు జిల్లాలో 1, మెదక్ జిల్లాలో ఒక నేరానికి పాల్పడ్డారన్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన సిఐలు వీరబాబు, ప్రశాంత్ కుమార్, ఎస్ఐ శేఖర్ బాబులను ఎస్పి అభినందించి వారికి రివార్డులు అందజేశారు.కానిస్టేబుళ్ల అరిగెల సుభాకర్, బొక్కా దుర్గాప్రసాద్, లంకాడి శ్రీనివాస్, అర్జునరావు, కేతా రమణ, హరిబాబు, చిన్న ప్రసాద్ తదితరులు ఎంతో వ్యయప్రయాసల కోర్చి నిందితులను పట్టుకుని చోరీ సొత్తు రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించారని ఎస్పి తెలిపారు.



నిందుతల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారంతో ఎస్‌పి, సిబ్బంది

మద్యం షాపుల సిబ్బంది విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎపి స్టేట్ బేవరేజీస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు ప్రభుత్వ మద్యం షాపులలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మంగళ వారం విధులను బహిష్కరించారు. పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని మద్యం షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. మద్యం షాపుల ఉద్యోగుల సంఘం నాయకులు రెడ్డి రవీంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నూతన మద్యం పాలసీలో తమ ఉద్యోగాలు తొలగించకుండా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గొర్రెల మణికంతకుమార్, బేదంపూడి కిషోర్, కె.గంగాధర్, ఏగు ప్రసాద్ పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** మండలంలో పలు మద్యం షాపులను మూసివేసి సిబ్బంది తమ నిరసనను వ్యక్తం చేశారు. **సామర్లకోట** మండలంలో మద్యం షాపులను మూసి వేసి సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకం కాదని, గత ఐదేళ్లుగా ఈ ఉద్యోగాల మీదనే ఆధారపడి మా జీవనం కొనసాగిస్తున్నామని అన్నారు. నూతన మద్యం పాలసీతో తమ ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతుందని అన్నారు. తమను తొలగించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 15 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఆర్.అశోక్, చంద్రగిరి శ్రీను, ఎం.ప్రసాద్, ఎస్ మురళి, టి.వీరబాబు, పి.వెంకటేశ్, గోవింద్, బి.రాజేంద్ర, డేవిడ్, ఆర్‌వెంకట్రావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చిన్నారులకు విసినకర్రతో విసురుతున్న కుటుంబీకులు

రోగులకు ఉక్కపోత...

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ కోత కారణంగా రోగులు, చంటిబిడ్డలు ఉక్కపోతకు గురయ్యారు. ఆసుపత్రికి జనరటర్ సదుపాయం ఉన్నప్పటికీ దానిని ఉపయోగించకపోవడంతో సుమారు 6 గంటల పాటు రోగులు అప్పుడే పుట్టిన చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బలుసుల పేటలో చెట్లు నరికేందుకు వీలుగా మంగళవారం ఉదయం సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అయితే అదే ఫీడర్‌పై ప్రభుత్వ ఆసుపత్రి విద్యుత్ కనెక్షన్ ఉండటంతో ఆసుపత్రికి విద్యుత్ కోత తప్పలేదు. దీంతో రోగులు, చిన్నారులు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకూ ఇబ్బంది పడ్డారు. ఆసుపత్రిలో జనరేటర్ సదుపాయం ఉన్నా దానిని వినియోగించకపోవడంతో రోగులు అవస్థలు పడ్డారు. విసిన కర్రలు, అట్ట ముక్కలతో చిన్నారులకు గాలి విసురుతూ గడిపారు. ఉదయం 10 గంటల సమయంలో ఆసుపత్రి వైద్యాధికారులు వచ్చే వరకూ ఆసుపత్రికి విద్యుత్ సరఫరా లేదన్న విషయం సిబ్బంది వారి దృష్టికి తీసుకెళ్లలేదు. రోగుల ఇబ్బందిని పాత్రికేయులు వైద్యుల దృష్టికి తీసుకెళ్లడంతో ఉదయం 11 గంటలకు జనరేటర్‌ను వినియోగించి వార్డుల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ పరిస్థితి వలన సుమారు 6 గంటల పాటు రోగులు, చిన్నారులు ఇబ్బందులకు గురయ్యారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - కరప

మెటీరియల్‌ను అందిస్తున్న నిర్వాహకులు

నవోదయ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో మంగళవారం నవోదయ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కెబి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ పరీక్ష రాసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యంగ్ మైండ్ సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ చిన్న అందించిన స్టడీ మెటీరియల్‌ను ఎంఇఒల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుడు హాలీం, పులపకూర సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో వెబినార్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 3, 4 సంవత్సర విద్యారుర్థులకు 'ఇ-ప్లాన్' ఉపయోగించి ఎలక్ట్రికల్ డిజైన్‌ను సాధించడంపై ఆన్‌లైన్ వెబ్‌నార్‌ను నిర్వహించారు. విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ దోలా సంజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - కిర్లంపూడి

స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల చట్టాలు, బాల కార్మికుల నిర్మూలన అంశాలపై వీరవరం సెక్టార్ సూపర్‌వైజర్ పి.భూసమ్మ అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో చిల్లంగి సెక్టర్ పరిధిలోగల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 36 మంది ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక వికాస అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల కల్పన విభాగం మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 36 మంది ఎంపికయ్యారు. ఇండో ఎంఐఎం కంపెనీ 14 మందిని, గూగుల్ పే కంపెనీ 22 మందిని తమ కంపెనీల్లో ఉద్యోగులుగా ఎంపిక చేసుకుందని జెసి టి.నిషాంతి అన్నారు. వీరికి నియమా కపు ఉత్తర్వులను జెసి చేతులు మీదుగా అందజేసినట్లు వికాస జిల్లామేనేజర్ జి .రమేష్ తెలిపారు.

వరద బాధితులకు విద్యార్థుల సాయం

ప్రజాశక్తి-అమలాపురం

వరద బాధితుల కోసం అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి (సమనస) జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు సిఎం సహాయ నిధి కి రూ.15 వేల చెక్కును జెసి టి.నిషాంతికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల జి.నాగ సత్యనారాయణ, బి. సత్యనారాయణ, టిఎన్‌వి సుబ్రహ్మణ్యం, విద్యా కమిటీ ఛైర్మన్ ఎలిపే ముత్యాలబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

5న పిహెచ్‌సి ప్రత్యేక బ్లాక్ ప్రారంభం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర పిహెచ్‌సి ఆవరణలో బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బలుసు జానకి రామయ్య పర్యవేక్షణలో రూ.75 లక్షలతో నిర్మించిన ప్రత్యేక బ్లాక్ ఈనెల 5న ప్రారంభం కానుందని నిర్వాహకులు తెలిపారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, స్థానిక ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పిహెచ్‌సి బ్లాక్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం పిహెచ్‌సి వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో బలుసు జానకి రామయ్య తదితరులు మాట్లాడారు.

27వ వార్డు కౌన్సిలర్ శ్రీరాములు మృతి

ప్రజాశక్తి రామచంద్రపురం

పట్టణంలోని,27వవార్డ్ కౌన్సిలర్ కట్టా శ్రీరాములు (70) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు రామచంద్రపురం పరిసర గ్రామాల్లో ప్రభుత్వ హాస్టల్ వార్డెన్ గా ఆయన గతంలో పనిచేశారు. వార్డెన్ శ్రీరాములుగా అందరికీ సుపరిచితులు. మున్సిపల్ ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

టూరిజం డైరెక్టర్ రాంబాబుకు సన్మానం

ప్రజాశక్తి-ఆలమూరు

కొత్తపేట నియోజకవర్గ టిడిపిపరిశీలకులుగా వ్యవహరిస్తున్న వాసిరెడ్డి రాంబాబును రాష్ట్ర టూరిజం డైరెక్టర్‌గా నియమితులయ్యారు. పెనికేరులో జరుగుతున్న పింఛన్ల పంపిణీలో పాల్గొనడానికి విచ్చేసిన రాంబాబును కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో జాతీయ రక్తదాన దినోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని ఏరియా హాస్పిటల్‌లో మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదానం దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో మోడరన్ కాలేజీ విద్యార్థులు స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ తొగర మూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ వీరభద్రుడు, సునీత, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-కాట్రేనికోన

హైస్కూల్ స్థాయిలో విద్యను అభ్యసిస్తున్న బాలికలకు పలు విషయాలపై ఎస్ఐ అవినాష్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. పి.లక్ష్మివాడ జడ్ హైస్కూల్లో బాలికలకు మహిళా సంరక్షణ, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, ప్రమాదాలు మీద అవగాహన, సైబర్ నేరాల మీద అవగాహన, లైంగిక వేధింపులు, వారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సూరిబాబు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సిరపరపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించక పోవడం,రేట్లు అధికం కావడం, విచ్చలవిడి అవినీతి వల్ల ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోవడానికి ఇసుక రాజకీయం కూడా ఒక కారణమన్నారు. ఇసుక ఉచితంగా ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించారన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా పూర్తిస్థాయిలో ఉచిత ఇసుక లభ్యం కావడం లేదన్నారు. .చేతినిండా పని లేక లక్షలాది కార్మిక కుటుంబాలు అవస్థలు పడుతున్నాయన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4 వ తేదీన స్థానిక కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో భవన నిర్మాణరంగంలోని అన్ని విభాగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నీలంశెట్టి పండు, పాసిల రమణ, తైనాల శ్రీను, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు,డి క్రాంతి కుమార్,ప్రజానాట్యమండలి నాయకులు దారపురెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం మండలంలోని పులిమేరులో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో కాంట్రాక్టు కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణపై కపట నాటకాలు ఆడుతున్నారన్నారు. రాత్రికి రాత్రే 4290 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. వెంటనే తొలగించిన కార్మికులందరికీ విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం నాయకులు కె.ముసలిబాబు, పి.అన్నవరం, నారాయణరావు, భూషణం పాల్గొన్నారు.

యానాం వార్తలు

విద్యార్థులకు క్రమశిక్షణపై వరిస్తున్న దాట్ల దేవదానం రాజు

చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక మహాత్మా గాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక యానాం కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు మంగళవారం నిర్వహించారు. పాఠశాల స్థాయిలో గెలుపొందిన 10 బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కమిటీ అధ్యక్షులు ఆనాల వీరభద్రరావు పరీక్ష ప్రారంభించగా, గౌరవాధ్యక్షులు దాట్ల. దేవదానం రాజు విజేతలను ప్రకటించారు. మహాత్మా గాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన శివరామకృష్ణ, రుద్ర, పుష్పక్ బృందం ప్రథమ స్థానంలోనూ, ప్రయివేటు పాఠశాలల నుంచి నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ స్కూల్ అర్చిత, శ్రీలాస్య, అఖిల్ బృందం ప్రథమ స్థానం, ప్రభుత్వ పాఠశాలల నుంచి పికె.ప్రభుత్వ పాఠశాల గిరియాం పేట నాగదేవి, గణేష్, సుదర్శన్ జట్టు ద్వితీయ స్థానం, ప్రయివేట్ పాఠశాలల నుంచి నారాయణ ఈ టెక్నో పాఠశాల విద్యార్థులు యశస్వి, నాగసాయి, శ్రీభవ్య జట్టు ద్వితీయ స్థానం సాదించారు. ప్రథమ స్థానం పొందిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలకు చెందిన రెండు జట్లకు అక్టోబరు 27 న జరిగే జిల్లా స్థాయి చెకుముకి సైన్సు సంబరాలకు హాజరవాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవివి.సత్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు మోహిబుల్లాఖాన్, కార్యకర్తలు టి.శ్రీనివాస్, ఎం.బాలకృష్ణ, క్రాంతికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రీమ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - యానాం

స్వచ్ఛతాహి కార్యక్రమంలో భాగంగా యానాం మహాత్మా గాంధీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశంపై పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల్లో డ్రీమ్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రయివేటు స్కూల్ యానాం రీజియన్ స్థాయిలో ప్రథమ స్థానం పి. లోకేశ్వరి, రీజియన్ సెకండ్ పి.సుమ ప్రతిభ కనబరిచారు. ప్రయివేటు స్కూల్ సీనియర్ స్థాయిలో నాల్గవ స్థానం ఎం.కళ్యాణ్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా డ్రీమ్స్ స్కూల్స్ ఛైర్మన్ శేరు వెంకట రమణ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంతోపాటు, కలలు, చేతిపనులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలిపారు. పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల మేనేజర్ శేరు వర్మ, హెచ్ఎం మాథ్యూ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

జిఎంసి బాలయోగికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

యానాం సమాచార శాఖ ఆధ్వర్యంలో జిఎంసి.బాలయోగి జయంతిని మంగళవారం నిర్వహించారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో ఉన్న జిఎంసి.బాలయోగి విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ, సిఐ షణ్ముఖం, ఎస్ఐ నూకరాజు, ప్రభాకరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కవితా విశ్లేషణ పోటీల్లో ఆదిత్య విద్యార్థికి బహుమతి

ప్రజాశక్తి - కాకినాడ

అభ్యుదయ రచయితల సంఘం కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన కవితా పఠన, విశ్లేషణ పోటీల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి బహుమతి సాధించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. డాక్టర్ అద్దేపల్లి రామ్మోహన్‌రావు కవితా పఠన, విశ్లేషణ కార్యక్రమం అరసం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌టియు భవన్‌లో జరిగింది. ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి డిఎస్.శ్రీ భావన డాక్టర్ అద్దేపల్లి 'మెరుపు పువ్వు' పుస్తకంలో 'నాకు జీవితం కవిత్వం వేరు వేరు కాదు' అనే కవిత పై విశ్లేషణ చేసి తృతీయ బహుమతి సాధించింది. పోటీలలో పాల్గొన్న విద్యార్థులను ఆదిత్య డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, తెలుగు విభాగాధిపతి తేజేశ్వరరావు అభినందించారు.

దస్తావేజులు పడిపోయినది

[illegible] 3347/2008 ది.08-11-2008 [illegible] ది.16-09-2024 [illegible]

బూసి సుగంధ పద్మలత
W/o [illegible]
[illegible]
పెద్దాపురం,కాకినాడ జిల్లా
సెల్:[illegible]

దస్తావేజులు పడిపోయినవి

డా.బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా , మామిడికుదురు మండలం, కొమరాడ గ్రామంకు చెందిన వలవల కుమార స్వామి S/o సూర్యనారాయణ మూర్తి కు చెందిన భూమికి సంబంధించిన డి.పి. నంబర్ 928/1977 [illegible] 20.6 లో ఎ.0.19 సెంట్లు, [illegible] 20.7 లో ఎ.0.17 సెంట్లు, [illegible] 20.8 లో ఎ.0.24 సెంట్లు కు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ [illegible]

వలవల కుమార స్వామి
S/o సూర్యనారాయణ మూర్తి
D no 1 58, కొమరాడ
మామిడికుదురు మండలం,
సెల్: 9640886777

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No.744/2023 In A.S.No.86/2023
Between:
పాఢాల లక్ష్మయ్యస్వామి ...Petitioner/Appellant
మరియు
[illegible] ...Respondent
To:Respondent:
[illegible], S/o. వెంకటరావు, వయస్సు 47 సంలు, ప్రయివేటు ఉద్యోగి, [illegible], కాకినాడ
[illegible] ది.25-10-2024 [illegible] 10.30 [illegible] (శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.వి.చలపతి
అడ్వకేట్, 9-11-136, గాంధీ విగ్రహం దగ్గర, [illegible], గాంధీనగర్, కాకినాడ, సెల్: 98482 60426

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
A.S.No.86/2023
Between:
పాఢాల లక్ష్మయ్యస్వామి ...Appellant
మరియు
[illegible] ...Respondent
To:Respondent:
[illegible], S/o. వెంకటరావు, వయస్సు 47 సంలు, ప్రయివేటు ఉద్యోగి, [illegible], కాకినాడ
[illegible] ది.25-10-2024 [illegible] 10.30 [illegible] (శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.వి.చలపతి
అడ్వకేట్, 9-11-136, గాంధీ విగ్రహం దగ్గర, [illegible], గాంధీనగర్, కాకినాడ, సెల్: 98482 60426

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కాకినాడ వారి కోర్టులో
F.D.P.NO:5/2021 In O.S.NO:469/2017
Between:
1. [illegible] ...పిటిషనర్/వాది
మరియు
1. [illegible] ...రెస్పాండెంట్/ప్రతివాదులు
To
[illegible] substituted service [illegible] ది. 17-10-2024 [illegible] 10.30 [illegible] (శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
[illegible]
కాకినాడ, అడ్వకేట్, కాకినాడ
తేది.01-10-2024. సెల్.[illegible]

మహారాజశ్రీ పెదపూడి [illegible] సివిల్ జడ్జి ([illegible]) గారి కోర్టులో..
IA No: 278/2024 IN OS No:120/2015
[illegible] ...DHR
మరియు
1) [illegible] ...రెస్పాండెంట్/ప్రతివాదులు
To,
R11) [illegible]
[illegible] IA No:278/2024, IA No: 279/2024, IA No:280/2024 మరియు IA No: 281/2024 [illegible] ది.17-10-2024 [illegible] 10:30 [illegible]
కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
[illegible] ది. 17-10-2024
[illegible]